## క్లుప్తంగా

### ఉద్యాన పంటలపై అవగాహన

**చంద్రుగొండ:** ఉద్యాన పంటల సేద్యంపై మండలకేంద్రం చంద్రుగొండలోని రైతువేదికలో మంగళవారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఉద్యానశాఖ డివిజన్ అధికారిణి ఎం.స్రవంతి మాట్లాడుతూ.. 2025–26 ఏడాదికి గాను ఉద్యాన పంటలు, ప్రభుత్వం ఇస్తున్న రాయితీలను వివరించారు. బొప్పాయికి ఎకరానికి రూ.30 వేలు, డ్రాగన్ ఫ్రూట్స్‌కు రూ.10వేలు, తీగజాతి కూరగాయల సేద్యానికి సంబంధిచి శాశ్వత పందిర్ల నిర్మాణానికి రూ.1 లక్ష, ప్లాస్టిక్ మల్చింగ్‌కు రూ.20 వేలు రాయితీ ఇస్తున్నట్లు రైతులకు వివరించారు. అదనపు సమాచారం కోసం నంబర్ 8977714126కు సంప్రదించాలని కోరారు.

### ‘దేశచరిత్రలో చీకటి రోజు’

**ములకలపల్లి:** 50 ఏళ్ల క్రితం ఇందిర నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఎమర్జన్సీ.. భారత దేశ చరిత్రలో చీకటి రోజని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు అన్నవరపు కనకయ్య అన్నారు. మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన మండలకమిటీ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మాట్లాడారు. పార్టీ మండల కార్యదర్శి ముదిగొండ రాంబాబు, ఊకంటి రవికుమార్, మాలోతు రావూజా, నిమ్మల మధు, అమల తదితరులు పాల్గొన్నారు.

### ఇళ్లు మంజూరు చేయాలి

**చర్ల:** గోదావరి వరద ముంపు బాధితులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం చర్లలోని పార్టీ కార్యాలయంలో జరిగిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కె.బ్రహ్మాచారి, రేపాకుల శ్రీనివాస్ మాట్లాడుతూ.. జూలై 1, 2 తేదీల్లో మండల స్థాయి రాజకీయ శిక్షణా తరగతులు సత్యనారాయణపురంలో జరుగుతున్నాయని తెలిపారు. సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి మచ్చా రామారావు, మండల కమిటీ సభ్యులు కారం నరేష్, పొడుపుగంటి సమ్మక్క, దొడ్డి హరినాగవర్మ, తాటి నాగమణి, పామర్ బాలాజీ, షారోని పాల్గొన్నారు.

### ఉద్యమిద్దాం..

**మణుగూరురూరల్:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలపై ఐక్యంగా ఉద్యమించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కె.బ్రహ్మాచారి కార్మికవర్గానికి పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సమస్యలపై జులై 9వ తేదీన జరిగే దేశ వ్యాప్త సమ్మెలో కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు గద్దల శ్రీనివాస్, సత్రపల్లి సాంబశివరావు, వై.రంగా, హేమలత, సదానందం, శైలజ, అరుణ, సారిక, పి.నాగేశ్వరరావు, రవి, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

### బాల్యమిత్రుల ఆర్థికసాయం

**కరకగూడెం:** మండలంలోని గొల్లగూడెం గ్రామానికి చెందిన ఇర్ప నాగేంద్రబాబు అనే యువకుడి తల్లి లక్ష్మి అనారోగ్యంతో ఇటీవల మృతిచెందగా.. చిరుమల్ల గిరిజన ఆశ్రమ పాఠశాల పదో తరగతి (2019–20) బ్యాచ్ విద్యార్థులు ఆర్థిక సాయం అందించారు. కుటుంబాన్ని పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. తమవంతు సాయంగా రూ.10 వేలు అందజేశారు. అదేవిధంగా గ్రామ క్రీడాకారులు కూడా నాగేంద్రబాబు కుటుంబానికి మద్దతుగా నిలిచి రూ.3,500 అందించారు. కష్టకాలంలో అండగా నిలిచిన మిత్రులను పలువురు అభినందించారు.

### యుద్ధోన్మాదాన్ని ఖండించండి

**భద్రాచలంఅర్బన్:** అమెరికా అండతో పాలస్తీనా, ఇరాన్‌లపై ఇజ్రాయిల్ చేస్తున్న యుద్ధాన్ని తీవ్రంగా ఖండించాలని సీపీఎం భద్రాచలం పట్టణం కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారం సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలో నిరసన చేపట్టారు. పార్టీ పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి అధ్యక్షతన జరిగిన సభలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎంబీ నర్సారెడ్డి మాట్లాడారు. పార్టీ జిల్లా కమిటీ సభ్యులు సున్నం గంగా, పట్టణ కార్యదర్శివర్గ సభ్యుడు వై.వెంకట రామారావు, పి.సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### ‘బాలవెలుగు’కు వితరణ

**మణుగూరుటౌన్:** మండలానికి చెందిన దోసపాటి ధర్మారావు బాలవెలుగు అనాథ పాఠశాలకు రూ.5వేల చెక్కును అందజేశారు. బుధవారం ధర్మారావు తన మనమరాలు జ్ఞానశ్రీ పుట్టినరోజును పురస్కరించుకుని ముత్యాలమ్మనగర్‌లోని బాలవెలుగు విద్యార్థులకు యూనిఫాం నిమిత్తం రూ.5వేల చెక్కును నిర్వాహకులకు అందజేశారు. పాఠశాల నిర్వాహకులు హర్షం వ్యక్తం చేశారు.

### మృతికి సంతాపం

**అశ్వాపురం:** మల్లెలమడుగు గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు, ఇటుక బట్టీల వ్యాపారి సురకంటి వెంకటరమణారెడ్డి మృతిపై తోటి బ్రిక్స్ యూనియన్ నాయకులు బుధవారం యూనియన్ కార్యాలయంలో సంతాప సభ ఏర్పాటు చేశారు. వెంకటరమణారెడ్డి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బ్రిక్స్ యూనియన్ అధ్యక్షుడు మర్రి మల్లారెడ్డి, గౌరవ అధ్యక్షుడు కొండలరావు, సభ్యులు పాల్గొన్నారు.

# ఇక్కడ సమస్యలు ‘డబుల్’

- అందుబాటులో లేని రహదారి
- బీటలు వారుతున్న భవనాల గోడలు
- అమెర్ధ పంచాయతీ డబుల్ బెడ్‌రూం ఇళ్ల తీరిది..

**అశ్వాపురం మండల పరిధిలోని అమెర్ధ గ్రామ పంచాయతీలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల నివాసాల్లో సమస్యలు తిష్ట వేశాయి. భవనాల గోడలు బీటలు వారుతూ వర్షాలకు కురుస్తున్నాయి. రహదారి సౌకర్యం లేక డబుల్ బెడ్ రూం వాసులు ఇబ్బందులు పడుతున్నారు.**

**అశ్వాపురం:** గత ప్రభుత్వ హయాంలో మొదటి విడతలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల పథకంలో భాగంగా మండల పరిధిలోని అమెర్ధ గ్రామ పంచాయతీలో ప్రభుత్వ కార్యాలయాలకు సమీపంలో 40 ఇళ్లను నిర్మించారు. 2020 డిసెంబర్ 18న అప్పటి ఎమ్మెల్యే రేగా కాంతారావు ఇళ్లను ప్రారంభించారు. 35 ఇళ్లలో లబ్ధిదారులు నివాసం ఉంటున్నారు. అయితే మౌలిక సౌకర్యాలు లేక వీరంతా సతమతం అవుతున్నారు.

**కురుస్తున్న భవనాలు..**

40 డబుల్‌బెడ్రూం ఇళ్ల భవనాలు శిథిలావస్థకు చేరుతున్నాయి. భవనాలు గోడలు బీటలు బారి ఫ్లోరింగులు కుంగి పోతున్నాయి. పై కప్పులు, గోడల వెంబడి వర్షాలకు కురుస్తున్నాయి. భారీ వర్షాలు కురిస్తే ఇళ్లల్లో నీరు జలమయమవుతున్నాయి. దీంతో ఇళ్లలో నివసించలేక లబ్ధిదారులు ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి భవనాలకు మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.



డబుల్ బెడ్‌రూం ఇళ్ల మధ్య బురదమయంగా మారిన రహదారి

**బురదమయంగా రహదారులు**

ఇక్కడ డబుల్‌బెడ్రూం ఇళ్లకు కనీస రహదారి సౌకర్యం లేదు. వర్షాలకు ఇళ్ల ఎదుట బురదమయమై ఇంటి నుంచి బయటకు అడుగు తీసి అడుగు వేయలేని పరిస్థితి. ఇదికాక విద్యుత్ మినహా ఇతర అనేక మౌలిక సదుపాయాలు ఇక్కడ లేవు. మిషన్ భగీరథ నీరు ప్రతి రోజు రాక ఒక్క చేతిపంపులో అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వం స్పందించి డబుల్‌బెడ్ రూం ఇండ్ల మధ్య రహదారులు నిర్మించాలని లబ్ధిదారులు కోరుతున్నారు. సమస్యల పరిష్కారానికి స్థానిక ఎమ్మెల్యే చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

**అడుగు తీసి అడుగు పెట్టలేం..**



డబుల్‌బెడ్‌రూం ఇళ్ల మధ్య రహదారి నిర్మించలేదు. బురదమయమై ఇంటి నుంచి బయటకు వస్తే అడుగు తీసి అడుగు పెట్టలేకపోతున్నాం. భారీ వర్షాలు కురిస్తే ఇళ్ల నుంచి బయటకు వస్తే మోకాళ్ల లోతు బురద ఉంటుంది.

– రాగం రవి, స్థానికుడు

**గోడలు కురుస్తున్నాయి..**



డబుల్‌బెడ్రూం ఇళ్ల భవనం గోడలకు పగుళ్లు వచ్చి వర్షాలకు కురుస్తున్నాయి. పెద్ద వర్షం వస్తే ఇళ్లు జలమయమవుతున్నాయి. పగుళ్లు వచ్చిన ఇళ్లను బాగుచేయాలి. ఇక్కడి పరిసరాల్లో అంతర్గతంగా రోడ్లు వేయాలి.

– కోట ఎల్లమ్మ, స్థానికురాలు

# డ్రగ్స్ నిర్మూలనపై ర్యాలీ



కరకగూడెం: ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్సై పీవీఎన్ రావు, పోలీస్ సిబ్బంది

**కరకగూడెం:** ‘యాంటీ డ్రగ్ అవగాహన వారోత్సవాల్లో’ భాగంగా బుధవారం కరకగూడెం పోలీసులు మండలంలోని అనంతారం గ్రామంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఎస్సై పీవీఎస్ రావు మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాల దుష్ప్రభావాలపై ప్రజల్లో ముఖ్యంగా యువతలో అవగాహన పెంచడమే లక్ష్యంగా ఈ ర్యాలీ నిర్వహించామని తెలిపారు. ఎవరైనా మత్తు పదార్థాలు వాడినా,విక్రయించినా లేదా సరఫరా చేసినా వారి గురించి వెంటనే పోలీసు వారికి తెలియపరచాలని గ్రామస్తులకు సూచించారు. అవగాహన ర్యాలీలో పోలీస్ సిబ్బంది, స్థానిక యువత తదితరులు పాల్గొన్నారు.

**విద్యార్థులకు వ్యాసరచన పోటీలు**

**అశ్వారావుపేటరూరల్:** మాదకద్రవ్యాల నిర్మూలన వారోత్సవాల్లో భాగంగా బుధవారం విద్యార్థులకు వ్యాస రచన పోటీలను నిర్వహించారు. అశ్వారావుపేటలోని సూర్య స్కూల్ విద్యార్థులకు స్థానిక ఎస్సై యయాతిరాజు ఆధ్వర్యంలో ‘మాదకద్రవ్యాల వినియోగంతో కలిగే అనర్థాలు’అనే అంశంపై బుధవారం ఈ పోటీలను నిర్వహించగా.. విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. ముందుగా విద్యార్థులకు మత్తుపదార్థాల నివారణపై అవగాహన కల్పించారు.

# వన మహోత్సవానికి సిద్ధంగా ఉండాలి

**అశ్వారావుపేటరూరల్:** వన మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు క్షేత్ర స్థాయి సిబ్బంది అంతా సిద్ధంగా ఉండాలని అడిషనల్ డీఆర్‌డీఓ నల్లబోతుల రవి అన్నారు. బుధవారం అచ్యుతాపురంలో నర్సరీని, గ్రామానికి చెందిన కాశిని బాలరాజు అనే రైతు సాగు చేస్తున్న మునగ పంటతోపాటు మద్దికొండ గ్రామంలో నారం పెంటయ్య సాగు చేస్తున్న డ్రాగన్ పంట క్షేత్రాలను సందర్శించి పరిశీలించారు. అనంతరం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సిబ్బందికి నిర్వహించిన శిక్షణా కార్యక్రమానికి ఆయన హాజరై సిబ్బందికి పనుల నిర్వహణ, రిజిస్టర్ల నమోదు గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈజీఎస్ పథకం ద్వారా అందిస్తున్న పథకాలు, రాయితీల గురించి రైతులకు మరింత అవగాహన కల్పించాలని సూచించారు. మునగ పంట సాగును ఈ వానా కాలం సీజన్‌లో మరింతా పెంచేలా చూడాలని చెప్పారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్, ఈజీఎస్ ఏపీఓ రామచంద్రరావు, కార్యదర్శులు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అడిషనల్ డీఆర్‌డీఓ రవి

### రోడ్లపై వాహనాలు పార్కింగ్ చేయొద్దు

**అశ్వారావుపేటరూరల్:** రోడ్లపై ఇష్టారాజ్యంగా వాహనాలను పార్కింగ్ చేయవద్దని, ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలుగజేస్తే కేసులు నమోదు చేస్తామని సీఐ పింగళి నాగరాజు రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని వినాయకపురం గ్రామంలోని భద్రాచలం వెళ్లే ప్రధాన మార్గంలో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన రహదారి పక్కనే ఉన్న దుకాణాలదారులు, రోడ్డుపై వాహనాలు పార్కింగ్ చేసిన వారికి నిబంధనలు పాటించాలని వివరించారు. నిబంధనలు పాటించకపోతే వాహనదారుడితోపాటు, దుకాణాలదారులపై కుడా చర్యలు తప్పవని ఈ సందర్భంగా హెచ్చరించారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

### సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్

**భద్రాచలంటౌన్:** భద్రాచలం పట్టణం చర్ల రోడ్డులోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావ్ బుధవారం లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. వివిధ అనారోగ్య సమస్యలతో వైద్యం చేయించుకుని ఆర్థిక సహాయం కోసం సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకున్న గురుజాల సత్యవతి, కామవరపు వెంకట సుబ్రహ్మణ్యం, యామన వెంకటేశ్వరరావులకు చెక్కులను అందజేశారు.

### క్రైస్తవం శాంతిని కోరుకుంటుంది..



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

**దమ్మపేట:** క్రైస్తవం ప్రపంచంలోని సకల జనుల శాంతిని కోరుకుంటుందని స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ వ్యాఖ్యానించారు. బుధవారం మండలంలోని మందలపల్లి గ్రామంలో ఉన్న బైబిల్ మిషన్ చర్చిలో పాస్టర్స్ ఫెలోషిప్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యేను పాస్టర్స్ సంఘం ఆధ్వర్యంలో శాలువాతో ఘనంగా సత్కరించారు. సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. అదనపు ఎస్పై బాలస్వామి, పాస్టర్లు, కాంగ్రెస్ నాయకులు పర్వతనేని ప్రసాద్, సోయం ప్రసాద్, చిన్నశెట్టి యుగంధర్, రాంబాబు, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

### సమ్మె నోటీస్ అందజేత

**అశ్వారావుపేటరూరల్:** దేశవ్యాప్త సమ్మెకు సంబంధించిన సమ్మె నోటీసును మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ మండల కమిటీ ఆధ్వర్యంలో ఎంఈఓకు అందించారు. బుధవారం స్థానిక విద్యా వనరుల కేంద్రం వద్ద కార్మికులు నిరసన వ్యక్తం చేసి ఆ తర్వాత కార్మిక చట్టాలు అమలు కోసం జూలై 9న చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మెకు సహకరించాలని సమ్మె నోటీస్‌ను ఎంఈఓ ప్రసాద్‌రావుకు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల అర్జున్, సీత, పద్మ, రాములమ్మ, రమాదేవి, శిరీష పాల్గొన్నారు.

### దాడి ఘటనలో కేసు నమోదు

**ములకలపల్లి:** దాడి ఘటనలో పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. ఎస్సై కిన్నెర రాజశేఖర్ కథనం ప్రకారం.. మండల పరిధిలోని చాపరాలపల్లి గ్రామానికి చెందిన వాసిరెడ్డి కిషోర్ ఇంటి ఆవరణలోని నిమ్మచెట్లకు కాయలను ఇద్దరు చిన్నారులు ఈనెల 16వ తేదీన కోస్తుండగా, యజమాని సురేష్ అడ్డుకున్నాడు. ఒక చిన్నారి గ్రామానికి చెందిన కారేపల్లి సురేశ్ కొడుకుగా తేలడంతో అతడిని ఇంటికి పంపించాడు. ఇదిలా ఉండగా కిషోర్.. సురేశ్ ఇంటికి వచ్చి అసభ్య పదజాలంతో తిడుతూ, కర్రతో భౌతికదాడికి పాల్పడ్డాడు. అదేరోజు సాయంత్రంలో బార్బర్ షాపు వద్ద ఉన్న సురేశ్‌పై కిషోర్ మరలా దాడి చేశాడు. చంపుతానని బెదిరించాడు. దీంతో బాధితుడు సురేశ్ బుధవారం పోలీసులను ఆశ్రయించగా.. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తునట్లు ఎస్సై తెలిపారు.

### హరితహారం చెట్లు ధ్వంసం

**చంద్రుగొండ:** మండలకేంద్రం శివారు అయన్నపాలెం గ్రామంలో ఉన్న గంటి వీరయ్య కుంటకు ఆనుకుని బీటీరోడ్డుకు పక్కన ఉన్న హరితహారం చెట్లను ఓ రైతు జేసీబీతో ధ్వంసం చేయించాడు. కుంట కట్టను కొంతమేర తవ్వించి తన పొలంలో కలుపుకున్నాడు. గమనించిన కొందరు రైతులు అధికారులకు ఫిర్యాదు చేశారు. సంఘటన స్థలాన్ని పరిశీలించిన పంచాయతీ కార్యదర్శి రాజేందర్ 16 చెట్ల వరకు కూల్చివేశారని ఉన్నతాధికారులకు నివేదించినట్లు తెలిపారు. ఈ సంఘటనపై ఎంపీడీఓ అశోక్‌ను వివరణ కోరగా.. విషయం జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లామని, ధ్వంసం చేసిన చెట్ల స్థానంలో మళ్లీ మొక్కలు నాటిస్తామని తెలిపారు.

### మంత్రిని కలిసిన కాంగ్రెస్ లీగల్ సెల్ కన్వీనర్

**బూర్గంపాడు:** ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి వాకిటి శ్రీహరిని జిల్లా కాంగ్రెస్ లీగల్ సెల్ కన్వీనర్ భజన సతీష్ బుధవారం హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. భద్రాద్రి రామయ్య ప్రతిమను అందజేసి శాలువాతో సత్కరించారు. భద్రాద్రి రామయ్య దర్శనానికి మంత్రిని ఆహ్వానించారు. జిల్లాలో పార్టీ పరిస్థితులపై కొద్దిసేపు మాట్లాడారు.

### తహసీల్దార్‌కు సన్మానం

**అశ్వాపురం:** మండల నూతన తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన మణిధర్‌ను బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు కొడాలి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో రేషన్ డీలర్లు మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో రేషన్ డీలర్లు పాయం భద్రయ్య, రజిత, భవాని, వంశి, డీలర్లు పాల్గొన్నారు.

### దుర్గాప్రసాద్ ఎంపికపై హర్షం

**చర్ల:** టీపీసీసీ జనరల్ సెక్రటరీగా చర్ల మండలానికి చెందిన నల్లపు దుర్గాప్రసాద్ ఎంపికపై మండలానికి చెందిన పలువురు పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం చర్లలో జరిగిన సమావేశంలో ఆ పార్టీ నాయకులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ కష్టించి పని చేసే వారికి తప్పకుండా గుర్తింపు ఉంటుందని, దానికి నల్లపు దుర్గాప్రసాదరావు ఎంపికే నిదర్శనమని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు చింతిరాల రవికుమార్, రాహుల్ గాంధీ సోషల్‌మీడియా జిల్లా ఇన్‌చార్జ్ సిద్ది గణేష్, యూత్ కాంగ్రెస్ నాయకులు విజయకుమార్ నాయుడు, నాయకులు సుందరి సురేష్‌కుమార్, సందీప్‌రెడ్డి, రాజేష్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

# కుండపోత వర్షం.. రైతుల్లో హర్షం

**అశ్వారావుపేటరూరల్:** మండల వ్యాప్తంగా బుధవారం మధ్యాహ్నం నుంచి ఎడతెరిపిలేకుండా భారీ వర్షం కురిసింది. జోరుగా కురిసిన వర్షంతో వాతావరణం చల్లబడింది. మున్సిపాలిటీ పరిధిలోని పోలీస్ స్టేషన్ సెంటర్, భగత్‌సింగ్ సెంటర్, గాంధీ బొమ్మ సెంటర్, ఖమ్మం మార్గంలో మురుగు కాల్వలు పొంగిపోర్లాయి. అదే విధంగా వరదనీరు రోడ్లపై ప్రవహించగా, వాహనదారులు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. అలాగే మండలంలోని ఊట్లపల్లి, వినాయకపురం, ఆసుపాక, మామిళ్లవారిగూడెం, నారంవారిగూడెం, నందిపాడుతోపాటు పలు గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. దీంతో ఆసుపాక గ్రామంలో భద్రాచలం వెళ్లే ప్రధాన రహదారి పక్కనే ఉన్న భారీ వృక్షం కొమ్మలు విరిగి రోడ్డుపై పడిపోయాయి. విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి. దీంతో పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. మరోవైపు, ఎడతెరిపిలేకుండా కురిసిన వరద నీరు రోడ్లపై ప్రవహించి జలమయమయ్యాయి. జోరుగా కురిసిన వర్షంతో సాగుకు సిద్ధమైన అన్నదాతల్లో ఆనందం వ్యక్తం అవుతోంది.

**దమ్మపేట:** మండల పరిధిలోని పలు గ్రామాల్లో బుధవారం ఎడతెరిపిలేకుండా గంటల పాటు కుండపోత వర్షం కురిసింది. భారీగా వర్షం కురవడంతో రోడ్లపై వర్షపు నీరు ప్రవహించింది. రోడ్డుకి ఇరువైపులా గల సైడ్ డ్రెయిన్లు నీటితో పొంగిపొర్లి, పల్లం వైపుకు ప్రవహించాయి. లోతట్టు ప్రాంతాల్లోకి భారీగా వర్షం నీరు చేరుకోవడంతో నీటి కుంటలను తలపించాయి. వరి పొలం సాగు చేసే వ్యవసాయ భూముల్లో నీరు చేరుకుంది. దీంతో అన్నదాతల ముఖాల్లో చిరునవ్వు సంతరించుకుంది. వర్షాకాలం ప్రారంభమైంది మొదలు ఇదే భారీ వర్షం కావడంతో రైతులంతా ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



దమ్మపేట: వర్షపు నీటితో నీటి కుంటలను తలపిస్తున్న లోతట్టు ప్రాంతం



ఆసుపాకలో ప్రధాన రహదారిపై విరిగిపడిన చెట్టు కొమ్మలు, విద్యుత్ వైర్లు

# అభివృద్ధి పనులు ప్రారంభం



బూర్గంపాడు: ఇరవెండిలో ఇంటి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే పాయం

**బూర్గంపాడు:** మండల పరిధిలోని మోతె, ఇరవెండి గ్రామాల్లో రూ.1.40 కోట్లతో నిర్మించిన బీటీ రోడ్డు, సీసీ రోడ్లను బుధవారం ఆయన ప్రారంభించారు. అనంతరం పలువురి లబ్ధిదారుల ఇందిరమ్మ ఇళ్లకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తొలివిడతలో ఇందిరమ్మ ఇళ్లు రానివారికి రెండో విడతలో మంజూరు చేస్తామని భరోసానిచ్చారు. కార్యక్రమాలలో తహసీల్దార్ శిరీష, ఎంపీడీఓ జమలారెడ్డి, ఎంపీఓ బాలయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

**అశ్వాపురం:** మండల పరిధిలోని తుమ్మలచెరువులో లోతువాగుపై రూ.3 కోట్లతో నిర్మించిన హై లెవల్ వంతెనను బుధవారం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ప్రారంభించారు. తుమ్మలచెరువు, వెంకటాపురం, గొందిగూడెం, గొందిగూడెం కొత్తూరు, ఎలకలగూడెం గ్రామ పంచాయతీల్లో సుమారు రూ.45 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను సైతం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామాలలో దశల వారిగా అన్ని సీసీరోడ్లు నిర్మిస్తామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మణిధర్, ఆర్‌ఐ లావణ్య, పీఆర్ డీఈ వెంకటేశ్వర్లు, ఏఈ చారి, నెల్లిపాక పీఏసీఎస్ అధ్యక్షుడు తుక్కాని మధుసూదన్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ రామకృష్ణ, మాజీ జెడ్పీ, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యులు షర్ఫియుద్దీన్, ఎస్‌కే.ఖదీర్, పంచాయతీ కార్యదర్శులు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య, నాయకులు పాల్గొన్నారు.

# మావోయిస్టులకు సహకరించొద్దు



యువతకు వాలీబాల్ కిట్లు అందిస్తున్న పోలీసులు

**గుండాల:** నిషేధిత మావోయిస్టులకు సహకరించి అమాయకులు బలికావొద్దని గుండాల సీఐ రవీందర్ అన్నారు. మండలంలోని చెట్టుపల్లి, సజ్జలబోడు, చింతలపాడు, కోటగడ్డ గ్రామాల్లో బుధవారం పోలీసుల ఆధ్వర్యంలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. గ్రామాల్లో కొత్త వ్యక్తులు కనిపిస్తే వారి సమాచారం వెంటనే పోలీసులకు అందించాలని, సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. మావోలు జనజీవన స్రవంతిలో కలిస్తే పోలీస్ శాఖ నుంచి ఆపరేషన్ చేయూత ద్వారా ప్రభుత్వం నుంచి సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. నిరుద్యోగులకు పోలీసుల నుంచి సహాయం అందిస్తామన్నారు. ఈ సందర్భంగా చెట్టుపల్లి యువతకు వాలీబాల్ కిట్లు అందించారు. యువత మత్తు పదార్థాలకు అలవాటు కావొద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై సైదా రహూఫ్, కొమరారం ఎస్సై నాగుల్ మీరా, సిబ్బంది పాల్గొన్నారు.

### దళారులపై చర్యలు తీసుకోవాలి

**భద్రాచలంఅర్బన్:** సంక్షేమ పథకాలు ఇప్పిస్తామని చెప్పి కొందరు రాజకీయ దళారులు ప్రజల వద్ద డబ్బులు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలపై అధికారులు తక్షణమే సమగ్ర విచారణ చేపట్టాలని, కఠినమైన చర్యలు తీసుకోవాలని సీపీఎం భద్రాచలం పట్టణ కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు పార్టీ పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇప్పిస్తామని చెప్పి కొందరి వద్ద లక్ష నుంచి రెండు లక్షల రూపాయల వరకు వసూలు చేసినట్లుగా ప్రచారం జరుగుతోందని అన్నారు. రాజీవ్ యువ వికాసం రుణాలు, రేషన్ కార్డు, పింఛన్లు తదితర పథకాల్లోనూ రాజకీయ దళారులు చేతివాటం చూపుతున్నారని ఆరోపించారు. తక్షణమే పూర్తి విచారణ చేపట్టి కఠినమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.


### వ్యాపార ప్రకటన బోర్డులను తొలగించాలి

**మణుగూరురూరల్:** మండలంలోని సమితిసింగారం గ్రామపంచాయతీలో రోడ్డును ఆక్రమిస్తూ ఇరువైపులా వ్యాపారస్తులు ఏర్పాటు చేసిన వ్యాపార ప్రకటన బోర్డులను, ఫ్లెక్సీలను వెంటనే తొలగించాలని మణుగూరు ఎంపీఓ పల్నాటి వెంకటేశ్వరరావు సూచించారు. బుధవారం ప్రధాన రహదారి వెంబడి ఉన్న దుకాణాలను పరిశీలించి.. పై విధంగా దుకాణ యజమానులకు సూచనలు చేశారు. నిర్దేశిత ప్రాంతంలో వాహనాలను పార్కింగ్ చేసేలా చూసుకోవాలన్నారు. వాహనదారులకు, ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా తమ వ్యాపారాలను నిర్వహించుకోవాలని, లేని పక్షంలో శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సమితిసింగారం కార్యదర్శి శ్రీకాంత్, సంతోష్, రాము, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు

**అశ్వారావుపేటరూరల్:** మండలంలోని మొద్దులమడ, రేగళ్ల, దురదపాడు గిరిజన గ్రామాల్లో బుధవారం వినాయకపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. ఆయా శిబిరాల్లో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రాందాస్ నాయక్ మొత్తం 38 మందికి వైద్య పరీక్షలు చేసి ఇద్దరు జ్వరాలతో బాధ పడుతున్నట్లు గుర్తించారు. వారికి వైద్య సేవలు అందించి, మందులు పంపిణీ చేశారు. అలాగే గ్రామాల్లో పరిసరాలను పరిశీలించి మురుగునీటి గుంతల్లో దోమల నివారణా మందును చల్లించారు. కార్యక్రమాల్లో సబ్ యూనిట్ అధికారి వెంకటేశ్వరరావు, హెల్త్ అసిస్టెంట్ సత్యనారాయణ, ఎంటీఎస్ విజయ్ రెడ్డి, ఏఎన్‌ఎం చెల్లమ్మ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

**గుండాల:** మండలంలోని మర్కోడు సబ్ సెంటర్ లోని పాతూరు గ్రామంలో ఆళ్లపల్లి ప్రభుత్వ వైద్యాధికారి సంఘమిత్ర నేతృత్వంలో వైద్యశిబిరం నిర్వహించారు. ప్రతీ ఇంటికీ తిరుగుతూ జ్వరాలపై సర్వే చేశారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమతెరలు వాడుకోవాలని సూచించారు. కలుషిత నీరు, ఆహారంతోపాటు వివిధ వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. సిబ్బంది రమాదేవి, నరేష్ ఆశా, వర్కర్లు పాల్గొన్నారు.



అశ్వారావుపేటరూరల్: వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

**దుమ్ముగూడెం:** మండలంలోని పర్ణశాల ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలోని కొండవాయి గ్రామంలో డాక్టర్ రేణుకారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో గ్రామంలోని రోగులను పరిక్షించి మందులు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ.. వర్షాకాలం సీజన్‌లో వచ్చే వ్యాధులపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై సూచనలు చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది నాగేశ్వరరావు, సావిత్రి, భాగ్యవతి, సురేష్, ఆశా కార్యకర్త కవిత తదితరులు పాల్గొన్నారు.